# విష ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



గోదావరిఖని : బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- **రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్**
- **బీఆర్‌ఎస్ లో పెద్ద ఎత్తున చేరికలు**

గోదావరిఖని, నవంబర్ 18: రామగుండం ప్రజల్లో తనకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక సామాజిక మాధ్యమాన్ని వేదికగా చేసుకొని కాంగ్రెస్ నాయకులు విష ప్రచారాలకు తెరలేపుతున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం టీడీపీకి చెందిన మీసాల కృష్ణ, పులి మహేశ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బీఆర్‌ఎస్ లో చేరారు. ఎమ్మెల్యే చందర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు తాను ఎన్నో ఎన్నికల్లో పోటీ చేశానని, ప్రత్యర్థుల నుంచి ఇలాంటి ప్రచారాలు ఎప్పుడూ చూడలేదన్నారు. సోషల్ మీడియా వేదిక ద్వారా కాంగ్రెస్ అభ్యర్థి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ తనపై విషం చిమ్మే ప్రచారం చేయడం శోచనీయమనీ, ఆ కుట్రలకు రామగుండం ప్రజలు సమాధానం చెబుతారన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఆ పోస్టులను పట్టించుకో వద్దని కోరారు. సీఎం కేసీఆర్ దీవెనలతో రామగుండం నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకవచ్చానని, ఆ అభివృద్ధి ఇంకా కొనసాగాలంటే ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి ఎమ్మెల్యేగా తనను తనను ఆదరించి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ కుట్రలను బద్ధలు కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ డిప్యూటీ మేయర్ అభిషేక్, కార్పొరేటర్ ఇంజపురి పులేందర్, జడ్పీటీసీ ఆముల నారాయణ, నాయకులు మూల విజయారెడ్డి, అడ్డాల రామస్వామి, కృష్ణవేణి, విజయ, తానిపర్తి గోపాల్ రావు, జిమ్మి బాబు, గోపు ఐలయ్య యాదవ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

**లక్ష్మీనగర్‌లో ఎమ్మెల్యే ప్రచారం..**

గోదావరిఖని ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. వ్యాపారులను ఒక్కొక్కరిని కలిసి ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

**బొట్టు పెట్టి... మ్యాఫెస్టో వివరించి**

కోల్‌సిటీ, నవంబర్ 18: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ గెలుపు కోసం 45వ డివిజన్ తిలక్‌నగర్‌లో కార్పొరేటర్ కొమ్ము వేణు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మహిళలు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి.. బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరించారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**12వ డివిజన్‌లో ఇంటింటికి ప్రచారం**

12వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కోరుకంటి చందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పసుల బాపు, చీకట్ల లక్ష్మయ్య, నవీన్, మనోజ్‌కుమార్, విజయ్, రాజు, జన్ను సతీశ్, అరుణ, లావణ్య, తిరుమల, కవిత, రమ్య, రేణుక, దీపిక, అప్సర, అనూష, మమత, అనిత, రజిత, రాజయ్య, ఐలయ్య పాల్గొన్నారు.



కోల్‌సిటీ : బొట్టు పెడుతూ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలు



యైటింక్లయిన్ కాలనీ : ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**వెంకట్రావుపల్లిలో ..**

యైటింక్లయిన్ కాలనీ, నవంబర్ 18 : రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు బూడిద సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఆశాకుమారి, ఉపాధ్యక్షురాలు శారద ప్రతి ఇంటికీ వెళ్లి కార్తు గుర్తు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బుర్ర ముత్యాలు, ఓదెలు, ఆర్‌బీ శ్రీను,అశ్విని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

## ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

జ్యోతినగర్, నవంబర్ 18: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై ఎన్టీపీసీ ఈడీసీ హాల్లో డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా సమక్షంలో కళాకారులతో ఆటపాటలతో విద్యార్థుల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఎలాంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఎటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈవీఎంపై డెమోతో పనితీరు, పోలింగ్ ప్రక్రియను విద్యార్థులకు వివరించారు. ఇక్కడ రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, ఏఆర్‌ఓలు కుమారస్వామి, జ్యోతి, డిప్యూటీ తహశీల్దార్ విజయ్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్, రామగుండం స్వీప్ నోడల్ అధికారి స్వరూపరాణి, కళాశాలల ప్రిన్సిపాల్స్, టీచర్స్, 18 సంవత్సరాలు నిండిని విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

## నేడు ఉద్యమకారుల పాదయాత్ర

జ్యోతినగర్, నవంబర్ 18: బీఆర్‌ఎస్ రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ గెలుపు లక్ష్యంగా నేడు ఆదివారం ఎన్టీపీసీ లోని తెలంగాణ ఉద్యమకారులు రామగుండంలోని శ్రీపాదక్షేత్రం రాముని గుండాల కొండ వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు వీరాలాల్ తెలిపారు. ఎన్టీపీసీ భీమునిపట్నం చిలుకలయ్యగుడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఎన్టీపీసీ రాజీవ్ రహదారి మీదుగా రామగుండం మజీద్ కార్నర్, విలేజ్ రామగుండం రోడ్ నుంచి శ్రీరామ పాదాల కొండమీద నిర్మాణం జరుగుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంకు చేరుకోని ఈ ఎన్నికల్లో కోరుకంటి చందర్ భారీ మెజారిర్టీతో విజయం సాధించాలని స్వామివారికి ముడుపులు కట్టనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రకు ఎన్టీపీసీలోని ఉద్యమకారులు ఉదయం 9గంటలకు చిలుకలయ్యగుడికి చేరుకొని పాదయాత్రలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## రామగుండంలో పోలింగ్ శాతం పెంచాలి



మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా

జ్యోతినగర్, నవంబర్18: గత ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గంలో అతి తక్కువగా 71శాతం పోలింగ్ నమోదైందని, ఈసారి పెంచాలని నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా సూచించారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో సెక్టార్ ఆఫీసర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో రాజేశ్ సింగ్ రాణా మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సదుపాయాలు, పోస్టల్ బ్యాలెట్, 12డీ విధానంపై చర్చించిన ఆయన పలు సూచనలు చేశారు. ఓటరు శాతం పెంపుకోసం స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ఓటరు స్లిప్పుల పంపిణీ సకాలంలో ముగించడం సెక్టార్ అధికారుల బాధ్యతన్నారు. తాగునీరు, టాయిలెట్స్, దివ్యాంగుల సౌకర్యార్థం రాంప్, వీల్‌చైర్స్, జనరేటర్, మెడికల్ క్యాంపు ఏర్పాట్లపై సూచనలు జారీ చేశారు. 12డీతో ఇంటి వద్దనే ఓటింగ్‌లో పాల్గొనే 24 బృందాలు వారికి నిర్దేశించిన వాహనాల్లో ఆయా రూట్లలో ప్రణాళిక ప్రకారం ప్రయాణించాలని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాల్లో 12డీ కార్యక్రమాన్ని నిరంతరం గమనించాలన్నారు. ఈవీఎం పరికరాల పనితీరు, కమిషనింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని లోపం తలెత్తినట్లయితే మరో మిషన్ అందుబాటులో ఉంచి 30 నిమిషాల వ్యవధిలో తిరిగి పోలింగ్‌ను ప్రారంభించాలన్నారు. ఈ నెల 30న సాయంత్రం 5గంటలకు పోలింగ్ కేంద్రాల గేట్ మూసివేయాలని, 5గంటలకు ముందు లోపలికి వెళ్లిన ఓటర్లు క్యూలో ఉన్న ఓటర్లను చివరి ఓటు వేసేవరకు పోలింగ్ జరిగేలా చూడాలని సూచించారు. ఆర్వో జే అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, ఏఆర్వోలు కుమారస్వామి, జ్యోతి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్ ఉన్నారు.

## చందర్ గెలువాలని వేములవాడకు పాదయాత్ర



ప్రకాశ్‌ను సాగనంపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గోదావరిఖని, నవంబర్ 18: రామగుండం 14వ డివిజన్ చైతన్యపురి కాలనీకి చెందిన ఆర్‌ఎఫ్‌సీఎల్ స్టోర్ వర్కర్ తాండ్ర ప్రకాశ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ గెలు వాలని వేములవాడకు పాదయాత్ర చేపట్టారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి శనివారం వేములవాడకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ

## ఓటుతోనే ప్రశ్నించే హక్కు

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ**

కోల్‌సిటీ, నవంబర్ 18 : ఓటు హక్కు కోల్పోతే ప్రశ్నించే హక్కు కూడా కోల్పోతారని రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం గోదావరిఖనిలోని పలు ప్రాంతాలలో కళాకారులు, ట్రాన్స్ జెండర్ల, ఆర్పీలు, నగర పాలక సిబ్బంది ఓటు హక్కు, ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాజరై ఓటు ఆవశ్యకతను వివరించారు. సమాజ అభివృద్ధిలో ఓటు కీలకమన్నారు. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణానికి నూటికి నూరు శాతం ఓటింగ్ జరగాలన్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఒక్కరోజు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సమయం కేటాయించేలా అందరిలో చైతన్యం రావాలన్నారు. ఈ నెల 30న తమ ప్రాంతాల్లో తప్పకుండా అందు బాటులో ఉండి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామగుండం నియోజక వర్గంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చేపడుతున్న ప్రచారాలపై అభినందించారు. అనంతరం చైతన్యరథం కళాజాత బృందం కళాకారుల ఆటపాటలు, గేయ, సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ప్రజలను ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, మెప్మా డీఎంసీ రజినీ, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవూఫ్ ఖాన్, రామగుండం నోడల్ అధికారి స్వరూపరాణి, ట్రాన్స్‌జెండర్లు, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు, సీవోలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

**30న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి**

ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్థానికంగా అందుబాటులో ఉండి ఓటు హక్కును వినియోగించుకోవాలని గర పాలక కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో స్వీప్ ఆధ్వర్యంలో రామగుండం పట్టణ సమాఖ్య అధ్యక్షులు, సభ్యులు, ధనశ్రీ పట్టణ సమాఖ్య సభ్యులకు ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ రజనీ, టీఎంసీ శ్వేత, సీఓలు, మెప్మా సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్‌లు, మున్సిపల్ సబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆర్‌పీలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, మహిళలు పాల్గొన్నారు.